'చిత్తం ముమ్మాటికీ నండి!'

'పైపెచ్చు నాలుగో కాలు విరిగిపోయిన ఆవు మనకి అవసరమని కొని తెస్తానంటావు కూడానూ! ఇంత వెధవముండ ఆలోచన...'

'చిత్తం! ఇంత బోడిముండ ఆలోచన!'

'అటువంటి ఆవు విచిత్రమనీ దాన్ని కొనితేవాలని నేనే చెప్పాననుకో—'

'చిత్తం ఏలినవారు అబద్ధాలాడతారా? మీరే చెప్పారు—'

'నేనే చెప్పినప్పటికీ-ఇటుచూడు శేషయ్యా-నీ బుద్ధి ఎక్కడ తగలబడిందోయి—వెధవమ్మా'

'చిత్తం! నేను అప్పుడే అనుకున్నానండి—'

'ఏమని?'

'చిత్తం తమరు—'

'ఏమిటి శేషయ్యా? ఏమనుకున్నావు? చెప్పు త్వరగా—'

'చిత్తం! తమరు గడ్డి తింటున్నారనీ, తమర్ని గడ్డి తినకుండా చేయాలనీ-ఈ అవసరం నాకు అప్పుడే తెలిసి వచ్చిందండి!'

## శత్రువు

'శేషయ్యా! హా! మంత్రీ!—'

'చిత్తం! మహారాజా! ఏలినవారికి అకస్మాత్తుగా-ఏమిటదీ?'

'వీపిమ్మీద ఏదో పాకుతోందోయి-!'

'నిండు పేరోలగంలో క్షుద్ర శత్రువేదో...'

'దానికి అంతమట్టుకేం తెలుస్తుందీ?-'

'ఏమై వుంటుంది ప్రభూ—పామా, తేలా—?'

'ఏదో చూడు, త్వరగా—నిన్ను పిలిచిందెందుకూ?'

'ఎక్కడ ప్రభూ, అది ప్రాకుతూంటు?'

'వీపిమ్మీద-వినబట్టంలా?'

'వినబడుతూందండి-కనపట్టంలేదు-'

'ఏమిటి కనపట్టం లేదూ?'

'ఏలిన వారిని హింసించడానికి వచ్చిన ఆ ఘాతుక-'

'ఛీ!'

'ప్రభూ!'

'చూడవోయి, త్వరగా చూడవోయి-'

'నేటికి సభ చాలించాం, ప్రభువు వారి వీపుమీద-'

'ఛ! వెధవ మాటలు, అవి తరవాత ఏడవకూడదూ, ముందు వీపుమీద ప్రాకేదేమిటో-'

'వీపుమీదేమీ కనపట్టంలేదు ప్రభూ!'

'అంగరఖాలోగాని వుందేమో?'

'చిత్తం! అంగరఖా విప్పి పరీక్షచేసేదా-'

'ఇంకా అడుగుతున్నావా-?'

* * *

'కనపడింది ప్రభూ! ఈ దుష్టభీకర నికృష్ట జంతువును ఏ విధంగా దండింపమని ప్రభువువారి ఆజ్ఞో సెలవిస్తే-?'

'ఇంతకీ అది పామా, తేలా?'

'అంతకన్న ఘోరమైనదేనండి-'

'ఆ!'

'చిత్తం! కండచీమండి-'

'దొరికిందా?'

'చిత్తం! కనపడిందండి-ఇంకా ప్రభువువారి వీపు నంటిపెట్టుకుని శరణుజొచ్చే వుందండి-'

'తీసెయ్యవేం ముందుగా?'

'చిత్తం! అది చాలా ఘాతుకమైన-'

'అందుకనే తీసెయ్యమంటూంట-'

'చిత్తం......'

'చిత్తమని వూరుకుంటావేం?'

'ప్రభువులు!'

'ఏమి టలా నీళ్లు నములుతూ చేతులు నులుపుకుంటావు?'

'ప్రభువులు కనికరించాలి-'

'కనికరించక ఇప్పుడు నిన్నేం చేశాను-'

'చిత్తం! అది దుష్టజంతువండి—'

'వప్పుకున్నాం! దానికి మరణ దండన విధించాం-ముందు దాన్ని మదీయ శరీరంనుంచి వేరుచేసి......'

'ప్రభువులు క్షమించాలి-ఆ పని నేను—'

'ఏమిటీ శాసన ధిక్కారం? శేషయ్యా సంవత్సరాల తరబడి నా కంటిలో పాపవలె మెలిగిన మహామంత్రివేనా నువ్వా-'

'చిత్తం! ఈ విషయంలో మట్టుకు నేను-'

'శేషయ్యా! ఏమిటా భయం?'

'చిత్తం! అది దుష్టజంతువండి-నేను దాన్ని తాకను!'

'కరుస్తుందని భయమా?'

'ఏలినవారికి తెలియనిదేముందండీ? కండచీమంటే కండ పట్టుకుని పీకేది—'

'మరి నిన్నింకా పీకలేదేం?'

'తమరు మహారాజులని దానికి తెలుసునండి-'

'అయితే అది నా శరీరంమీద ప్రాకడానికెలా సాహసించింది?'

'చిత్తం! ఏదో తప్పి దారివచ్చి అంగరఖాలో దూరివుంటుందండి-'

'ఇప్పుడు దీన్ని తొలగించే మార్గం ఏమిటీ?'

'చిత్తం! అదే ఆలోచిస్తున్నానండి!'

'దండించడని అభయహస్త మిస్తే దానంతట అది వెళ్ళిపోతుందేమో కనుక్కో—'

'చిత్తం! ఆ విషయం వేరే కనుక్కోనక్కర్లేదండి—దాని పొరబాటు

అది ఇది వరకే గ్రహించుకుని తమ వీపుమీద శరణుజొచ్చి పడివుంది– తమరు 'శరణు' అన్నారంటే చాలు అది–'

'అన్నాం! మంత్రీ! ఈ చీమను క్షమించాం. దాని దారిన అది నిర్భయంగా వెళ్ళిపోవచ్చును–''

'చిత్తం! అది ఇంకా కదిలిపోవడం లేదండి–'

'సంధిషరతులు దానికి నచ్చలేదా?'

'అదికాదండి–అంగరఖా తీయడంలో అది నలిగిపోయి వీరస్వర్గం చెందినట్టుందండి–'

'ఆ! చచ్చిపోయిందిటోయి! నిజంగానా! బాగా పరకాయించి చూడు—'

'చూశానండి–పుల్లతో కదిపి చూశాను–జీవాలు బాసింది!'

'శేషయ్యా! మనకేమైనా పాపం చుట్టుకుంటుందా?'

'ఎందుకండీ? దాన్ని మీరు చంపాలని చంపేరా?'

'కాకపోవచ్చును. అయినా, అది మదీయ శరీరంమీద అమరధామం ధరించింది కాబట్టి దాన్ని పదిలంగా, భక్తిగా క్రిందికి దింపి, భూశయనం చేయించు–'

'చిత్తం!'

'దాని కొక రత్నఖచితమైన సమాధికూడా నిర్మించి దానిపైన పాల రాతిమీద–ఏం రాయిస్తావు శిల్పిచేత?'

'చిత్తం! 'మహారాజావారితో పోరుసల్పి, వీరస్వర్గం చెందిన...'

'ఛ! ఛ! నీ తెలివితేట లన్నీ ఏమయ్యాయోయి మంత్రిశిఖామణీ?'

'మరి ఏమి రాయించమంటారు శిల్పిచాత?'

'మహారాజావారి ఆస్థానపు చీమ–దాని మృతికి వగచుచూ వారు చిరస్మరణీయంగా దానికై నిర్మించిన సమాధి అని వ్రాయిస్తే బాగుండదూ?'

'భేషుగా వుంటుందండి! వరహాలబుర్ర ఎలాగైనా తమది......'

'ఈ చీమ మృతి కారణం బాహ్య ప్రపంచానికి తెలియనీయకుండా వుండటానికని నీకు వెయ్యి వరహాలు......!'

'ప్రభువుల కటాక్షం!'